ఆకలికి బలి

"శంకర్"

ఊరికి వెలుపల ఒక బయలులో ఊడలు బారుకొని ఉందా మఱ్ఱిచెట్టు. దాని క్రిందే ఉందొక పూరి గుడిసె. గోడలన్నీ పడి పోయ్యాయి. కప్పుమీది గడ్డి అంతా గాలికి లేచి పోయింది. పేరుకది గుడిసే కాని దానిలో కూర్చుంటే ఆ చెట్టుక్రింద కూర్చున్నంత సుఖంగా కూడ ఉండదంటే సంశయము జనిస్తుంది. ఆ ఊడిపోయిన కప్పు ఇప్పుడో అప్పుడో పడిపోయే దానిలాగు భయముగొలుపుతూ యుంటుంది. రాత్రిళ్లు ఆ బూరుగుచెట్టు క్రింద ఏ పాములో తేళ్లో వుంటాయనే భీతి జనిస్తుంది.

అయితే ఆ గుడిసె నిర్మానుష్య మనటానికి వీలు లేదు. దాంట్లో పార్వతి, ఈశ్వరయ్య అనే దంపతు లుంటారు. వారి సుఖదుఃఖాశ్రయము, ఆనంద విశ్రామము అదే! వారి మేడ, భవనము అదే! అనుకుంటే అదేవారి స్వర్గ ధామం. వారిరువురు ప్రేమ సామ్రాజ్యంలో తేలియాడే యువతీయువకులనటానికి మాత్రం సందేహం లేదు. దినమంతా కూలికి పోయి వచ్చే ఆ గింజలతో కొంత గంజికాచుకొని త్రాగుతూ యుంటారు. ప్రతిదినము ఉదయాస్తమానము దరిద్ర దేవతతో యుద్ధము చేయడమే వారిపని. వారిద్దరు నిక్కంగా సుఖజీవనం గడుపుతూ యుంటారంటే ఆశ్చర్యమే! వారి నిర్మల ప్రేమ, వారి సద్గుణములే వారినట్లు చేసాయి. వారు మాత్రం దరిద్ర సముద్రంలో మునిగి తేలుచున్నారు. కానీ! వసంతవనరాగ శోభాయమానమైన ఈ విశాల ప్రపంచంలో, నిరంతరము సుఖముమరిగి ఆనంద డోలికలలో తేలియాడే ఈ ధనికవర్గంలో, బొజ్జల పెంచుకొని బీదల నోర్లుకొట్టి వారి కష్టార్జితంతో సంతోషించే ఈ వర్తక సమూహాల్లో వారినిచూచి జాలిపడేవారు మందుకు కూడ లేరు

ఈశ్వరయ్య యెలాగున్నా పార్వతిమాత్రం మంచి అందగత్తె. ఆమెకు సుమారు ఇరవై సంవత్సరాలకంటే ఎక్కువ ఉండవు. యౌవనంలో మిస మిసలాడే ఆ శరీరములోని బిగువు, ముడిపెట్టిన ఆమె నల్ల వెంట్రుకలు, ఆ కళ్ళలోని నలుపు, ఆ యంగసౌష్టవము ప్రతిమానవుని రంజిల్లజేయగలవు.



పొలముల్లో ఆమె పనిచేస్తూంటే తోటి వారికి, కడకు ఆ యజమానికి ఆమెపైనే దృష్టి. అన్నిటికిముందు ఆమె, అదృష్టం మంచిది. వారిద్దరికీ కొద్దిపాటి చదువుకూడ వచ్చు.

పనులకాలం దాటిపోయింది. అప్పుడు నిండువేసవికాలం ఎక్కడా పనులుండవు. ఈశ్వరయ్య మాత్రము పురుషుడు కాబట్టి ఏదో అక్కడా ఇక్కడా కూలిపనిచేసి జీవనానికి బత్తెము తెస్తూ యుంటాడు. దురదృష్టవశాత్తు అతడిప్పుడు జబ్బుపడ్డాడు పాపము రెండు రోజులయింది. అన్నములేదు. కడకు త్రాగుటకు గంజయినా లేదు. అతడు చూడటానికి హీన స్థితిలో యున్నాడు. అతనికిప్పు డన్నం కావాలి. అయితే గింజలెట్లా తీసుక రావాలి అనేది పార్వతికప్పుడొక పెద్ద సమస్య అయింది. పనికి వెళ్దామాఅంటే పనులు లేవు. బాకీగా తెస్తామాఅంటే తన కెవ్వరూ వెయ్యరు. అప్పుడేం చేయాలి? అలాగే పస్తుపడి చావాలా? తానంటే సరే—తన భర్తో—అతన్నికూడ అలాచేసి చంపవలసిందేనా? తన ప్రేమమూర్తిని రక్షించుకొనుటకు త్రోవలేమా! ఈ ప్రశ్న లన్ని పార్వతి మనస్సులో మెదల్తున్నాయి.

ఉదయించిన సూర్యుని బంగారు కిరణములు ఆ పూరి పాకలో దూరి ఆ పాదుగోడలపైబడి అరుణ కాంతి నాపా దిస్తున్నాయి. ఈశ్వరయ్య జ్వరభాధతోను, ఆకలి బాధ తోను మూల్గుతూ ఒకప్రక్క పడుకున్నాడు. పార్వతి అత నికి చేతనైన సపర్యలుచేస్తూ అక్కడే కూర్చుంది. మఱ్ఱిచెట్టు చల్లగా గాలి వీస్తుంది.

"పార్వతీ" అని పిలచి కళ్లు మూశాడీశ్వరయ్య.

"ఏమండీ! ఆయాసంగా ఉందా!" హెచ్చరించింది పార్వతి.

"కొద్ది గంజయినా కాచివ్వు" పార్వతి ముఖం వెల వెల పోయింది. ఆమె కళ్లల్లోనుండి వేడి కన్నీళ్లు కారి ఈశ్వ రయ్య పాదాలు తడిపాయి. "గింజలు లేవా" ఆమెభావ మ్మగ్రహించుకొని కళ్లుమూసాడు ఈశ్వరయ్య. పార్వతికేమీ గోచరం కావటంలేదు. ఎట్లయినా ఆ దినం తన భర్తకు పిడి కెడు గంజయినా కాసివ్వాలని త్రోవపట్టింది. తన కడుపు కక్కుర్తికోసం తన భర్త ప్రాణంకోసం ఆత్మాభిమానాన్ని బలిపెట్టుకోక తప్పిందికాదు. ఊళ్ళోన్న రైతుల దగ్గరికి వెళ్లింది. అందరినీ యాచించింది. కాని లాభంలేదు. ఆమెకుఎక్కడా ఎవ్వరూ ఒకపట్టెడు ధాన్యము వెయ్యలా! ఒక పెద్దఇంటికి వెళ్ళింది. ఆ యింటి యిల్లాలు బయటనే నిలుచునియుంది.

"అమ్మా! ఒక పది గింజలు బాకీ వేస్తారా! పని జేసి తీరుస్తా! నా భర్త ఆకలిచే అలమటించి పోతున్నాడు. గింజ లులేకపోతే ఆయన బ్రతకడు—దయ యుంచి కొంచెము ధాన్యము వెయ్యండి." అంటూ జాలిగా బ్రతిమిలాడింది.

"నీకు మగడుకూడాఉన్నాడా! నీవేం, యిక్కడ దాచి పెట్టావా ఏం!" అంటూ కసరిందామె, తనలాటి స్త్రీయని కనికరమైనాలేకుండా! ఆ మాటలు పార్వతి హృదయంలో శూలాల్లా గ్రుచ్చుకున్నాయి. ఆమె తలకు గోతులు త్రవ్వి నరాలకు నీళ్లుపోసాయి. అవమానంతో క్రుంగి పోయింది. ఆమెకు ఆత్మ, హృదయమూ, మనస్సూ ఉండవూ! బీదరా లయినంతమాత్రాన ప్రేమ, గౌరవము, మర్యాద అనునవి ఉండవా!

"నాకు పిడికెడు గింజలు వేయలేక కసరిపంపే ఈ పాడు ప్రపంచానికి నన్ను అవమానపరచటానికి దూషించ టానికి అధికార మెవ్వరిచ్చారు? నేను బీదరాలు నయినంత మాత్రాన నాకు పతి, పతిభక్తి అనునవుండకూడదూ! నేను లోకంలో సాధారణ యువతినికానూ" అంటూ అనుకుంటూంది. ఆమె హృదయములో ఎంత బాధ ఉందో! ఎవరికి తెలుసు?

ఇక ఆమె నడవలేకపోయింది. చేయిచాపి దేహీ యని యాచించటానిక్కి ఆమెకు బుద్ధి పుట్టలేదు. సుఖంలో మైమఱచి కన్నుమిన్ను గానని ఈ ధనికవర్గం ఆమెను దయ దలచదని తెలుసు. కాళ్లు ముందఱకు సాగడంలేదు. కంఠం ఎండుకుపోయింది. హృదయములో దడపుట్టింది. పాపము ఒకచోట కూలబడింది పార్వతి.

ఆమె ఎట్లో ఆకలికి తాళగల్గుతుంది. ఆమె ప్రాణాలు పోయినా ఆమెకు సమ్మతమే? అయితే ఆమె భర్త! అన్నంలేక చావవలసిందేనా? తానెప్పటికిని తన అనురాగ

మూర్తిని పోషించలేదా ? ఆమె మనస్సు తిరిగిపోయింది. ఇక ఆ ఊళ్లో వీరారెడ్డి అనే ఇల్లు ఒక్కటే మిగిలియుంది. అన్నిచోట్ల పెదవి చప్పరింపులూ, తిట్లూ, దీవనలూ అందు కుంది. అతని గృహానికి వెళ్లక తప్పిందికాదు. అతడు దుర్మార్గుడనే వినికిడి అయినంతమాత్రాన ఆమె నేమి చేయగలుగుతాడు ? ఒకవేళ పోకపోతే తన భర్తకు అన్న మెట్లా ? అనే విషయాలు ఆమె మనస్సులో మెద లుతూ యున్నాయి. కాళ్లీడ్చుకుంటూ ఆ యింటికి పోయింది.

వీరారెడ్డి మంచివాడే ! అయితే స్త్రీలోలుడు. అది ఒక్కటే అతనిలోని మచ్చ. పార్వతి అతని దగ్గఱకుపోయి గింజలడిగింది. పార్వతిని వీరారెడ్డి మోహించాడు. ఆమె లోని అందం అతన్ని ఆకర్షించింది. ఆ బిగి యౌవనంలోని సొంపు అతని మనస్సునుఱ్ఱూతలూగించింది. ఆమెను తన కఱకు చేతుల్లో కటకట నలపటానికతని మనస్సెంతో యుబలాట పడుతూంది. ఎన్నో రోజులనుంచి ఆశతో కాచుకున్న సమయం ఆదినం చేకూరింది. తన కామతృష్ణ చల్లార్చుకోటానికి అదే మంచి అదను. అతని హృదయం ఆనందంలో పరవశమౌతూంది. ఎదురుగ్గా పార్వతి నిలు చుంది. తదేకదృష్టితో పార్వతిని చూస్తూ నిలబడ్డాడు. అతని భావమెఱింగిన పార్వతి తలవంచుకొని ఇంటిదారి పెట్టింది.

" పార్వతీ " పిలచాడు వీరారెడ్డి. ఆమె నిలబడింది. " గింజలు కావాలన్నావుగదూ ! తిరిగి పోతావేం " పార్వ తికి ఆనందం కలిగింది. వీరారెడ్డి ఆమెను తన ధాన్యశాలకు తీసుకెళ్లాడు. ధాన్యం కుప్పతెప్పలుగా బస్తాలకు, గాదెలకు పోసియుంది. వీరారెడ్డి నిలబడ్డాడు. పార్వతికూడా అతని వెనుకనే నిలుచుంది.

" పార్వతీ ! నీకు తిండికి కష్టం లేకుండా ధాన్య మిస్తా!"

" మా కెందుకండీ ఏదో ఒక మానెడు ధాన్యం వేస్తే తిరిగి తీర్చివేస్తా ! "

" తిరిగి ఇవ్వవలసిన అవసరంలేదు చూడు ! "

" వద్దుబాబూ ! మీ ఋణం మా కెందుకు పనిజేసి? తీర్చివేస్తా."

" పిచ్చిదానా ! నే చెప్పేది బోధపడటంలే ! నీవు పని జేయవలసిన అవసరం లేదు. ఇక్కడే యుండు నా దగ్గర !"

" నా భర్తగారో "

" భర్తా ..భర్త " అంటూ విరగబడి నవ్వాడతడు. నే చెప్పిన్నా చేసి నీ జీవితం సుఖప్రదంచేసుకో ! " ఆ మాటల్లో ఎంతో వెటకారం గోచరిస్తూయుంది. పార్వతికి సూదులతో గ్రుచ్చినట్లయింది.

" నా భర్తను విడచా .."

" నీ భర్త భర్త " నిదానించి పలుకటంలో హాస్యము ఎగతాళి అర్థమౌతున్నాయి. " ఆలోచించుకో ! నాకోర్కె తీర్చావంటె చాలు ! నీ జీవిత పర్యంతం నీకు కష్టంలేదు. నీ జీవితం సుఖప్రదం చేసుకో ! ఊరికే ఆ పిచ్చిపుల్లయ్య గాడితో భర్త, భర్త అని ఎందుకు దేవురిస్తావు ? నీ దరిద్ర దేవతను మాయం జేస్తా " వీరారెడ్డి ఇంకా చెబుతున్నాడు. ఆ నిర్మల ప్రేమమయికి ఇవన్నీ సహించలేదు, తల వంచింది.

" వప్పుకున్నట్లేనా ? రా ! పద " అంటూనే వీరారెడ్డి ఆమెచేయి బెడిసి పట్టుకున్నాడు. ఆమె గుండెలు ఝల్లు మన్నాయి. శరీరము జలదరించింది. ఒడలంతా చెమ్మటలు కారాయి. అతడిలా పాపపుకోర్కె కోరుతాడని కలలో కూడ తలచలేదు. బలవంతంగా చేయి విడిపించుకుంది. ఇక అక్కడ నిలువక పరుగుతీసింది.

" బాగా ఆలోచించుకో ! నానుండి తప్పించుకోలేవు. నీ జీవితం సుఖప్రదంచేసుకో. పో. నీ భర్తను బ్రతికించుకో" అంటూ వీరారెడ్డి కడసారిగా ఆమెకు చెబుతూ ఇంటికి వచ్చాడు.

" పాడు ప్రపంచం, పాడు లోకం, కామాంధకారంలో కన్ను మిన్నుగానని ఈ తుచ్ఛ మానవ సమూహంలో నాలాటి దరిద్ర యువతులకు తావులేదు. వీరి కళ్లకు

అందంగా అగుపడ్తే చాలు మోహించడమే. వీరి తుచ్ఛ పశువాంఛ కెంకటు తమ నిర్మల ప్రేమను బలి పెట్టుకుంటున్నారో! అబ్బ! వీరి కంతులేనేలేదూ! నాబోటి స్త్రీలకు భర్త లుండగూడద నేనా వీరి అభిప్రాయము. నాలాటి తిండి కట్టు గుడ్డ లేని దరిద్ర యువతులందరూ వ్యభిచారుల నే వీరి యుద్దేశం! వారి ధాన్యాన్ని ఆశించి వారి తృష్ణ చల్లార్చుతార నేనా వీరి ఆశయం! నీచ మానవ సమూహం. నీచ ప్రపంచం!" అనుకుంటూ పార్వతి లో నుండి కుమిలి కుమిలివచ్చే దుఃఖము దిగమింగుకుంటూ కడు పాక చేత్తో పట్టుకొని పరుగెత్తుతూ యుంది.

సాయంత్రం కావస్తుంది. ప్రొద్దు పడమర పూర్తిగా వాలింది. పూరి గుడిసెలో ఈశ్వరయ్య "అబ్బ! ఆకలి ...నొప్పి" అని మూల్గుతున్నాడు. పార్వతి అతని ప్రక్కనే అతనికి పాదసేవ చేస్తూ కూర్చుంది. ఆహారం లేకుంటే ఈశ్వరయ్య బ్రతికేట్టుగా కనిపించటం లేదు. ఆమె దుఃఖ హిమ వన్నగమునుంచి దుమికే భాష్పగంగకు, సింహాద్రి నుంచి ప్రవహించే కన్నీటి కావేరికి అంతులేదు. ఆ వేడి భాష్పాలన్నీ ఈశ్వరయ్య పాదాలు తడిపాయి.

"పార్వతీ...గంజి .." నీరసంగా, సన్నగా విన వచ్చాయి. ఆ మాటల్లో ఎంతో బలహీనత, ఎంతో వేదన తాండవిస్తూంది. పార్వతికి మనస్సు చలించింది. గింజలెట్లా తేవాలనేది ఒక పెద్ద సమస్యయింది. ఆమె చకిత హృదయంలో, గాయపడ్డ ఆ బిడలేత గుండెలోనుండి ఎన్నో భావాలు ఎన్నో ఆశాపూరిత యుద్దేశాలు దారి తీస్తున్నాయి. ఆమె మనస్సు కలత జెందింది. భర్త—ప్రేమమూర్తి—నిర్మల ప్రేమ—అనురాగ దాంపత్యం—త్యాగం" అన్నవి ఆమె మనసులో కదల్తూన్నాయి.

"నీ ప్రేమమయుడు, అనురాగ రక్తుడు ఆకలికి అలమటిస్తున్నాడు. అతనికోసమైన జీవితాన్ని త్యాగం చేయవలసిందే—నీ సుఖాన్ని వదలాల్సిందే! నీ వయోలావణ్యాన్ని, నీ విలాస సుకుమారాన్నీ, పండువంటి నీ యౌవ్వనమును, కడకు నీ ప్రాణములను ధారపోయవలసిందే" అని ఎవ్వరో ఒకప్రక్క చెప్పినట్లయింది.

"భర్తకొరకయితే మాత్రం నీ శరీరాన్ని అమ్ముకొంటావా? నీ యౌవనము, లావణ్యము నీచ పడుపు వృత్తికి బానిస కావాలా?" అని మరియొకరు చెప్పినట్లయినది.

"శాస్త్రదూష్యమా! అవన్నీ స్వార్థపరుల వచనాలు! అయినంత మాత్రాన మనము వాటి ననుసరించాలా! మొదట్లో నీ భర్త ప్రాణాలు నీ ప్రాణాలు పోతూయుంటే ఏ సంబంధములేని శాస్త్రాలుపట్టుకొని ఊగులాడేవా! కానీ, నీ ప్రణయ సామ్రాట్టును నీవు బ్రతికించుకోవాలి! అతనికి భార్యవై నీవాతని ప్రేమఫలానికర్పించేదేమిటి-మీ నిర్మల ప్రేమకన్నీ త్యాగం చేయవలసిందే! బలి పెట్టవలసిందే! గత్యంతరంలేదు, అప్పుడే ఆనందం-సుఖం-ప్రపంచం." ఒక భావము గోచరించింది.

"ఛీ పాడుపని! అది లోకంలో నీచం కాదు! ప్రజలంతా నిన్ను వ్యభిచారియని దూషించరూ! నీకూ, హీనమైన వేశ్యకూ భేదమేముంది? నీవింక లోకంలో తక్కువైపోవూ! అది అవమానంచేకూర్చదూ" ఇంకొకభావం పాడనూపింది.

"కానీ! ఈ లోకంతో నీకేమి పని? పిచ్చి లోకం! మూర్ఖప్రపంచం-నీవు బ్రతికేది వారికి ఓర్పులేదు. లోకాన్ని అనుసరిస్తే జీవనము గడువవద్దూ-పోనీ నీ భర్తను బ్రతికించుకోపో. నీవు వేశ్య వెలాగవుతావు నీ హృదయము పవిత్రమైతే చాలు. నీ పచ్చిమాంసాన్నే కదూ అతడు వాంఛించేది! నీ హృదయములేని శరీరాన్నే కదూ అతడు కోరేది. ఆత్మలేని నీ కళేబరాన్నే కదూ అతడు కావాలనింది. మనసులేని శవముపైనేకదూ అతనికి మమకారం. తప్పులేదు పో! నీ జీవితాన్ని సుఖప్రదం చేసుకో! నీ భర్త ప్రాణాలు కాపాడుకో! మీ అనురాగ దాంపత్యంలో ప్రేమజ్యోతులు వెలిగించు" అంటూ ఒక దివ్యస్వరం చెబుతూన్నట్లనిపించింది. ఈ భావానికామె తలఒగ్గింది. ఒక అచంచల స్థిరత్వం ఆమె ముఖంలో ప్రస్ఫుటించింది. ఇస్సుమంచు కూలబడింది. సూర్యుడు పశ్చిమాంగనా చేరబోతూ తన కనక వస్త్రాన్ని గాలికి లేవదీశాడు. ఆ యిల్లు ఆ మఱ్ఱిచెట్టు తళతళా పసిమి కాంతుల్లో మిలమిలలాడుతున్నాయి.

ఆకలికి తాళలేక ఈశ్వరయ్య నీరసంగా మూల్గుతున్నాడు. అతన్ని చూడటంతోటే ఆమె హృదయం

ద్రవ్యాలయింది. ఇక తాళలేక ఏమయినా సరేనని లేచి త్రోవపట్టింది. వీరారెడ్డి ఇల్లు జేరినది. నిర్జీవ ప్రతిమవలె వీరారెడ్డికి స్వాధీనమయినది.

వీరారెడ్డి కామతృష్ణ చల్లారింది. పార్వతి ఆతురతో ఇంటిదారి పట్టింది. లోపల తన భర్త ఏమయ్యాడో అనే దిగులు ఆమెను కలత బెట్టుతూయుంది. ఆమె వెనువెంట ఇద్దరు మనుష్యులు ఒక ధాన్యపుబస్తా భుజాలపై వేసుకొని త్రోవపట్టారు పార్వతి ఇల్లుచేరింది. వెంట వచ్చిన ఇద్దరు మనుష్యులు బస్తా అక్కడవేసి ఇంటికి వెళ్లారు ఆశ్చర్య పడుతూ!

పార్వతి ఈశ్వరయ్య పాదాలకడ కూర్చుంది. పున్నమ జాబిలి తన తెల్లటి కిరణాలను ఆ పూరి పాకలో ప్రవహింప జేశాడు ఆ శరత్కాంతిలో వారి ముఖంలోని విషాదచ్ఛాయలు స్పష్టమౌతున్నాయి. కళ్లు తెరచి చూచాడు ఈశ్వరయ్య. అతని నోటవెంట మాట రావటం లేదు. నీరసపడి పోయ్యాడు. గంజి కొఱకు నోటితో సంజ్ఞ చేసాడు. వడివడిగా పార్వతి గంజికాచి తీసుక వచ్చింది. అప్పటికే ఈశ్వరయ్యలో బలహీనత ఎక్కువయింది.

"ఇదిగో! గంజి త్రాగండి, తీసుక వచ్చాను" అంటూ పార్వతి పిలచింది. ఈశ్వరయ్య కళ్లు తెరచి చూచాడు. అతనిలో ఆనందము మెఱపులా మెఱసింది. కాని ఎంతకాలం? తలపైన శనిదేవుడు శివతాండవం చేస్తూంటే ఆనందమెలా గుంటుంది? బలహీన స్థితిలో లేవలేక పోయ్యాడు ఈశ్వరయ్య. మెల్లగా పార్వతి అతనిని లేవనెత్తి గంజిముంత నోటివద్ద పెట్టింది. చేతితో పట్టుకొని త్రాగబోతూ త్రాగలేక నీరస స్థితిలో క్రింద పారవేశాడు పార్వతి ఆపలేక పోయింది. ముంత క్రిందపడి గంజంతా చిదికిపోయింది. 'అబ్బా' అని మూల్గాడీశ్వరయ్య. "పా.. ర్వ తీ" పూర్తిగా పలుక లేక పోయ్యాడు. అదే అతని కడసారిమాటలు. నీరసస్థితిలో క్రిందపడి పోయ్యాడు. అంతే—అతని శరీరములో రక్త ప్రవాహం నిలచి పోయింది. అవయవాలన్నీ బిగుసుకు పోయ్యాయి. గుడ్లు తేలవేశాడు. అంతా చూస్తూన్న పార్వతి ఒక్కసారిగా కెవ్వుమని కేకవేసి అతనిపై పడి పోయింది. ఆమె నిర్మించుకున్న ఆశలను భగ్నం గలుగుట చేతనో ఏమో ఆమెలోని దుఃఖము పొంగి పొర్లి గుండె నిలచి పోయింది. అంతే! వారిద్దరి శవాలు ఒకదానిపైనొకటి పడి యున్నాయి. వారి ఆత్మలు అనంత వాయువులో కరగి పరమాణువులై లీనమైపోయ్యాయి. ఒక తీతువు పిట్ట తీ, తీ యని మఱ్ఱిచెట్టుమీదనుంచి కూసింది.

ఈ స్వార్థ ప్రపంచంలో ఆమె కులటా!!

★

కలవు రాతిరి కన్నెకు కనులు వేయి

బోర్డిల్లాన్

కలవు రాతిరి కన్నెకు కనులు వేయి
కాని దినరాజు కొక్కటే కన్ను చూడ
వెలుగు లోకాలలో వెలుగు వెలుగులన్ని
అస్తమించును దినకరు డస్తమింప.

కలవు మనసను మగువకు కనులు వేయి
కాని ఎడదను చూడగా కన్నొకండె
దీర్ఘ జీవిత కాలపు దివ్య తేజ
మస్తమించును ప్రేమతా నస్తమింప.

శ్రీ గుంటుపల్లి రాధాకృష్ణమూర్తి

★